క్లుప్తంగా

నగరంలో 30 పోలీస్ యాక్ట్

విజయవాడ స్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 30 పోలీస్ యాక్ట్‌ను నగరంలో అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వీటిని విధిస్తున్నట్లు వెల్లడించారు. ఆంక్షల సమయంలో పోలీసు ముందస్తు అనుమతి లేకుండా నగరంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు, చేయొద్దని హెచ్చరించారు.

బాబా మందిరంలో విష్ణు సహస్రనామ పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. పారాయణ మండలి సభ్యులు బ్రహ్మీ ముహూర్తంలో పూజలు చేసి భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. అనంతరం పారాయణ మండలి సభ్యులు కోలాటమాడారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి పర్యవేక్షించారు.

11న వాహనాల వేలం

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్ స్టేషన్, అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్లలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన మొత్తం 23 వాహనాలను ఈ నెల 11వ తేదీ ఉదయం10 గంటలకు నున్న పోలీసు స్టేషన్ ప్రాంగణంలో వాహనాల వేలం వేస్తారని ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజారవాణా సంస్థలో ఉద్యోగులకు అవార్డులు



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ డిపోలో పని చేస్తూ విధి నిర్వహణలో ఇంధనాన్ని ఆదా చేసిన ఉద్యోగులకు శుక్రవారం ఆర్టీసీ అధికారులు అవార్డులను అందచేశారు. విజయవాడ మెయిన్ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొని 2019–2020, 2020–2021 సంవత్సరాల్లో ఇంధన పొదుపులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన డ్రైవర్లు, అత్యుత్తమ పనితీరును కనబర్చిన గ్యారేజీ సిబ్బందికి రివార్డులను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా సంస్థ అధికారి డీవై దానం, డిప్యూటీ సీటీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం



అయోధ్యనగర్‌లో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ఆరుద్రోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమ, పసుపు, పాలు, తేనె, పెరుగుతో పాటు అన్నాభిషేకం చేశారు. ప్రత్యేక అర్చనలు జరిగాయి. అర్చకులు శేఖర్ శర్మ ఆరుద్రోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

నోట్ పుస్తకాల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టీనర్‌పేటలో టీఎంహెచ్ స్కూల్ విద్యార్థులకు వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. శ్రీసాయి అన్న క్షేత్రం, శ్రీసాయిబాబా మందిరం వ్యవస్థాపకులు మహేష్ బాబా సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దుర్గా కిషోర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకున్న తాను ఇప్పుడు తన తండ్రి పేరుతో స్థాపించిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు సహాయపడటం గర్వంగా ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా దుర్గా కిషోర్ తమ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయటం ఇది రెండో సారన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శామ్యూల్, జ్యోతి, మెర్సీ, రూసీ, క్లర్క్ యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- పెన్షనర్లకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పెన్షనర్లకు అండగా ఉంటూ పింఛన్‌ను క్రమక్రమంగా పెంచుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మధురానగర్ 207వ సచివాలయంలో 28, 29 డివిజన్లలో శుక్రవారం పింఛన్ వారోత్సవాలు జరిగాయి. ఎమ్మెల్యే విష్ణు, నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్లను క్రమక్రమంగా పెంచుతున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా పేదలకు న్యాయం చేయడంలో వెనకాడటం లేదని చెప్పారు. 28వ డివిజన్‌లో 25 మందికి, 29వ డివిజన్‌లో 37 మందికి కలిపి మొత్తం 62 కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు.

ఓర్వలేకే పింఛన్లపై దుష్ప్రచారం

పేదలకు పెద్ద ఎత్తున జరుగుతున్న మేలును చూసి ఓర్వలేక పింఛన్లపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మల్లాది విష్ణు మండిపడ్డారు. ఇటీవల నోటీసులు జారీ చేసిన 1,764 మందిలో 1,074 మందికి పింఛన్ అందజేశామన్నారు. ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారికి, కార్లు ఉన్న వారికి మాత్రమే పింఛన్‌ను నిలిపివేసినట్లు తెలియజేశారు. పింఛన్లపై టీడీపీ దుర్మార్గ ప్రచారం చేస్తోందని.. దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు

అవినీతికి కేరాఫ్ టీడీపీ పాలన

టీడీపీ హయాంలో బడ్జెట్ భారీగా ఉన్నా.. నిధులన్నీ ఆ పార్టీ నేతల జేబుల్లోకి, జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లకు చేరాయని విష్ణు ఆరోపించారు. భర్తతో కలిసి ఉన్న మహిళలకు కూడా ఒంటరి మహిళ పెన్షన్లు మంజూరు చేయించి జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలు అంతా ఇంతా కాదని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని చెప్పారు. సాంకేతిక కారణాలతో పింఛన్ అందలేదనే ఫిర్యాదు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జి.సృజన, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కనపర్తి కొండ, ఎస్.కె.బాబు, కంభం కొండలరావు సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

● నాన్నా.. నేనున్నా..



అనుబంధం అనే కోవెలకు తొలి దైవం నాన్న. అంగవైకల్యం ఎదుర్కొంటున్న ఆ నాన్న ఎటువంటి పని చేయలేక కుటుంబపోషణ కోసం యాచన చేయదానికి తన చిన్నారి కుమారుడితో నడిరోడ్డుపైకి రావడం.. తండ్రి ఇబ్బంది పడుతుండటంతో ఆ పసిహృదయం తల్లడిల్లి తండ్రిని హత్తుకోవడాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. కృష్ణలంక రాణిగారితోటలో శుక్రవారం ఈ దృశ్యం కనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గడప గడపకూ సంక్షేమం..

ఎమ్మెల్యే విష్ణు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): గడప గడపకూ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ 209వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, అధికారులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన లబ్ధిని బుక్‌లెట్ల ద్వారా వివరించారు. వలంటీర్లు తమ క్లస్టర్ల పరిధిలోని గృహ యజమానులకు సచివాలయ ఉద్యోగుల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని మల్లాది విష్ణు సూచించారు. అనంతరం పలువురు అర్జీదారులకు మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులు, కుల, ఆదాయ ధ్రువ పత్రాలను అందజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు.

చట్టాలను గౌరవించాలి

రాజకీయ సభల కంటే ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి ముఖ్యమని జీవో నెంబర్ ఒకటి తీసుకువచ్చినట్లు విష్ణు అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకి.. పోలీస్ అధికారులతో ఎలా ప్రవర్తించాలో తెలియకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను వినియోగించుకోవాలి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమఫలాలను వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాసరావు అన్నారు. పాయకాపురం శాంతి నగర్‌లో శుక్రవారం దాసం దుర్గారావు, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉపాధితో కూడిన టెక్స్ టైల్స్ ప్రింటింగ్, జామ్ జ్యూస్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే అదనంగా సంక్షేమ పథకాల ద్వారా అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన పిమ్మట మహిళలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ రాంబ్రహ్మం, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, రాచకొండ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెబుల్ టెన్నిస్ పోటీలకు నగర క్రీడాకారులు



టేబుల్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: సీబీఎస్ఈ స్కూల్స్ జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో నగర క్రీడాకారులు డి.ప్రీతిక, ఎం.చార్వి స్థానం దక్కించుకున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు పెద్దాపురంలోని ప్రకాస్ సైనర్జీ స్కూల్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను టీటీ కోచ్‌లు బి.శ్రీనివాస్, షేక్ అక్రమ్, షేక్ గౌస్‌బాషా, ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, కృష్ణాజిల్లా కార్యదర్శి కె.బలరాం అభినందించారు.

అలరించిన సంగీత కచేరి



శివరామకృష్ణక్షేత్రంలో సంగీత కచేరి

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శృంగేరీ శారదా పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. బెంగళూరుకు చెందిన సంగీత విద్వాంసురాలు భార్గవి వెంకట్రామ్ వాగ్గేయకారులు రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై హెచ్‌కే వెంకట్రావు, మృదంగంపై కేయూ జయచంద్రరావు, ఘటంపై ఎం. హరిబాబు సహకరించారు. కార్యక్రమాలను ప్రారంభించిన స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ భార్గవీ వెంకట్రామ్ జీవిత విశేషాలను తెలియజేశారు. చిన్నతనంలోనే సంగీతంపై మక్కువతో స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల నాణ్యత పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం కమిషనర్ సర్కిల్ –3 పరిధిలోని 15, 16 డివిజన్లలో పర్యటించారు. 15వ డివిజన్‌లోని వెలగపూడి సుబ్బారావు క్రాస్ రోడ్స్‌లో సి.సి. రోడ్లను, రీబౌండ్ హ్యామర్‌తో పనుల నాణ్యతను, రోడ్డు లోతు పరిమాణ నిబంధనలను స్వయంగా పరిశీలించారు. 15వ డివిజన్‌లోని పార్కులో అభివృద్ధి పనుల బిల్లులను చూశారు. 16వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో 10 ఎ.ఎల్.డి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో నిర్మించిన టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, తలుపులు, కిటికీలను మార్చడం వాటన్నింటినీ పరిశీలించి, పంపింగ్ హౌస్‌కు పెయింటింగ్స్ వేయాలని, లోపల గ్రీనరీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు



శానిటరీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపడుతూ డివిజన్‌ను నగరంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడానికి సిబ్బంది కృషి చేయాలని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఈద్గామహల్ రోడ్డులోని శానిటరీ డివిజన్ కార్యాలయంలో రూ. 1.30 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేటర్ ఆదిలక్ష్మి శానిటరీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు(జగ్గు), శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, మేస్త్రి నరసింహ, డివిజన్ నాయకులు కోళ్ల రజని, వరలక్ష్మి, బాయన అమర్‌నాథ్, గాలి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలపైనే మానవ మనుగడ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుణదల (విజయవాడ తూర్పు): మానవ మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉందని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గుణదల సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో శుక్రవారం కదంబ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని సమతుల్యం చేయడానికి చెట్లు కీలక భూమిక పోషిస్తాయని తెలిపారు. ఆధునిక ప్రపంచంలో కాలుష్యం కారణంగా పర్యావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించడానికి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కదంబ అను పేరు గల మొక్క ద్వారా మానవాళికి ఎంతో మేలు చేకూరుతోందన్నారు. ఈ మొక్క ప్రయోజనాలను వివరిస్తూ ప్రదర్శించిన ఎగ్జిబిట్ కు తమ పాఠశాల 6వ తరగతి విద్యార్థి జి దాత్రితకు సైన్స్ కాంగ్రెస్–2023 జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కదంబ మొక్కను నాటి నీరు పోశారు. ఈ మొక్క ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.రామభారతి, వైస్ ప్రిన్సిపాల్ తరుణ్, ఎన్టీఆర్ కాలనీ ప్రెసిడెంట్ సుబ్బారావు, సుంకర రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామని కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. వాంబేకాలనీలో జి–బ్లాక్ వద్ద రూ. 4.74 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన కొత్త రోడ్లను నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కండ్రికలో రూ. 15.35 లక్షల వ్యయ అంచనాతో నిర్మించనున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ. 3 కోట్లతో నిర్మించిన వాంబే కాలనీ ప్రధాన రహదారితో పాటు రూ. 1.56 కోట్లతో పూర్తయిన 18 అంతర్గ రహదారులు, రూ. 18 లక్షలతో డి–బ్లాక్ కల్యాణ మండపం రోడ్డును ప్రారంభించామన్నారు. కండ్రికలో రూ. 15.35 లక్షల వ్యయ అంచనాతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు విష్ణు తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ మౌనమి, నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, యరగొర్ల శ్రీరాములు, ఆర్.ఎస్.నాయుడు, ఇస్మాయిల్, సుభాని, జిల్లెల్ల శివ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



క్యాన్సర్ అవేర్‌నెస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత

పాయకాపురం(విజయవాడరూరల్): క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స ద్వారా నిర్మూలించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత అన్నారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో పాల్గొనేందుకు 64వ డివిజన్ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఆమె క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ అవగాహన ప్రాజెక్ట్ పోస్టర్‌ను కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ తో కలిసి డాక్టర్ అమృత ఆవిష్కరించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి చెత్తను కాల్వల్లో డంప్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ బాసిద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రెడ్‌రోప్ స్వచ్ఛంద సంస్థ కాలేజీ ఇంక్లూజివ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్ జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంచడానికి, వారికి ఉన్న అవకాశాలు తెలియ చేయటానికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, రెడ్‌రోప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. క్రిసోలైట్ గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్ ఏర్పాటు చేశారన్నారు. రిసోర్స్‌పర్సన్ బినూ వర్గీస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల ద్వారా భయాలను ఎలా ఎదుర్కోవాలి, తిరస్కరణలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త టీవీ వకులప్రియ, దిల్‌షాద్ తదితరులు పాల్గొన్నారు.

బహుభాషా గాయకుడు మాధవపెద్ది సత్యం



మాధవపెద్ది సత్యం శతజయంతి సభలో మాట్లాడుతున్న చిట్టిబాబు, దుర్గానాగమణి తదితరులు

విజయవాడ కల్చరల్: బహుభాషా గాయకుడు మాధవపెద్ది సత్యం అని తెలుగు కళా వాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళా వాహిని, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళా భారతి సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం గాయకుడు మాధవ పెద్ది సత్యం శత జయంతి సభ, సినీ నటుడు సత్యనారాయణకు స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ గాయకుడు మాధవపెద్ది సత్యం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో ఏడు వేలకు పైగా పాటలు పాడినట్లు తెలిపారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శేషుబాబు సినీ నటుడు సత్యనాయణ సినీ రంగసేవలను వివరించారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు ప్రసంగించారు. గాయకులు దుర్గాప్రసాద్, మోహన్‌రాజ్, డానియల్, పావని. దుర్గానాగమణి, విజయశ్రీ గుప్తా పలు చిత్రగీతాలను ఆలపించారు.

వైద్యసేవలను బిహార్ వైద్య అధికారుల పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలను బీహార్‌కు చెందిన వైద్య శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా నగరంలోని హెచ్‌బీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రపంచ బ్యాంకు నిధులతో నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును వారు పరిశీలించారు. సమీకృత ఆన్‌లైన్ పేషెంట్ సేవలు, అసాంక్రమిక, సాంక్రమిక ఆన్‌లైన్ సేవలు, టెలిమెడిసిన్ సేవలు, మందుల పంపిణీ విధానం, రోగుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బీహార్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ సునీల్ కుమార్ ఝా, సహాయ సంచాలకులు డాక్టర్ మనీష్ రంజన్, ఇతర అధికారులు డాక్టర్ హేమంత్ షా, తన్మయ్ తదితరులు సందర్శించిన వారిలో ఉన్నారు. వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని, రాష్ట్ర జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమాదేవి, నోడల్ అధికారి విజయలక్ష్మి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డీపీఓ డాక్టర్ నవీన్ ఇక్కడ అందుతున్న సేవలను వివరించారు.